## బోల్తా పడిన కారు-ముగ్గురికి గాయాలు

**చౌటకూరు, నవంబరు 23, ప్రభాతవార్త:** కారు అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటన ముగ్గురు వ్యక్తులు గాయాలకు గురైన సంఘటన మండల కేంద్రమైన చౌటకూరు గ్రామ శివారులో 161వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... నారాయణఖేడ్ వైపు నుంచి హైద్రాబాద్ వెళుతున్న కారు చౌటకూరు గ్రామ శివారులోకి రాగానే అదుపుతప్పి బోల్తా కొట్టగా కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయాలకు గరయ్యారన్నారు. హైద్రాబాద్‌లోని బోడుప్పల్‌కు చెందిన క్షతగాత్రులు నాగరాజు, కరణ్, శివరాం రాథోడ్‌లను 108 వాహనంలో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.


చౌటకూరు శివారులో అదుపుతప్పి బోల్తా పడిన కారు దృశ్యం



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## ప్రతి ఒక్కరూ పరిరక్షణకు పాటుపడాలి : ధర్మవరం బ్రహ్మం

**సిద్దిపేట అర్బన్, నవంబరు 23, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని శుభదోయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో (ప్రీ-ప్రైమరీ)లో గ్రీన్ డే వేడుకను చిన్నారులతో ఘనంగా నిర్వహించారు. చిన్నారులలో ప్రకృతి ప్రేమ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ ధర్మవరం బ్రహ్మం తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. గ్రీన్ డే వేడుకలతో పాఠశాల మొత్తం ఆకపచ్చ వర్ణంతో కళకళలాడగా విద్యార్థులు వినోదాత్మక ,పర్యావరణ హిత కార్యక్రమాలలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం మొక్కలు నాటడడం, గ్రీన్ థీమ్ క్రాఫ్ట్స్, అసక్తికరమైన కార్యకలాపాల ద్వారా ప్రకృతి ప్రాధ్యాతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పి.నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






అందెశ్రీ సంస్మరణ గీతాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, టిపిసిసి తదితరులు

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా అందెశ్రీ సంస్మరణ గీతం ఆవిష్కరణ

**చేర్యాల,నవంబరు 23, ప్రభాతవార్త:** మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా అందెశ్రీ సంస్మరణ గీతాన్ని ఆవిష్కరించినట్లు కవి పిన్నింటి రత్నం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత,ప్రజా వాగ్గేయకారులు డాక్టర్ అందెశ్రీ సంతాప సభ శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరుగగా ఈ కార్యక్రమానికి ఎస్సి,ఎస్టి మైనార్టీ సంక్షేమ శాఖ అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.తెలంగాణ ఉద్యమానికి అందెశ్రీ రాసిన పాటలు ప్రజా చైతన్య దీపికలు అని ఆయన కోహినూర్ వజ్రం అని ఎల్లకాలం ఆ కుటుంబానికి అండదండలు ఉంటాయని తెలిపారు.కవులకు,కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.సభ కార్యక్రమం అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం స్వీయరచనలో మాయమై పోయెనమ్మ అందెశ్రీ సంస్మరణ గీతం వ్రాయగా గాయకులు,ఎల్ల సిద్దులు,పిల్లిట్ల శ్యామ్ సుందర్,పన్నీరు శ్రీనివాస్,రాచపల్లి శైలజ ఆలపించిన పాట ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సంక్షేమ శాఖ మాత్యులు అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ గౌడ్,తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల,భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు రవీందర్ రెడ్డి,మాజీ పిసిసి అధ్యక్షులు వి.హనుమంతరావు,మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఆవిష్కరణలో పాల్గొన్నారు.

# పక్కదారి పడుతున్న సబ్సిడీగ్యాస్!

..హోటళ్లు, రెస్టారెంట్లలో కమర్షియల్‌కు
..బదులు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల వాడకం
..ఉదాసీనంగా వ్యవహరిస్తున్న
సివిల్‌సప్లై అధికారులు

**జోగిపేట, నవంబరు 23, ప్రభాతవార్త:** ప్రభుత్వం పేదలకోసం అమలు చేస్తున్న సబ్సిడీ గ్యాస్ పథకం అధికారుల ఉదాసీనత వల్ల పక్కదారి పడుతుంది. అర్హులకు సబ్సిడీమీద అందచేసే గ్యాస్ సిలిండర్లు దారి మళ్లుతున్నాయి. గ్యాస్ సిలిండర్లలో కమర్షియల్, డొమెస్టిక్ కనెక్షన్లు వేరువేరుగా ఉంటాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు 19 కెజీలు ఉంటే, డొమెస్టిక్ సిలిండర్లు 14 కేజీలు ఉంటాయి. వీటి ధర కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకైతే రూ.19వందలు అయితే డొమెస్టిక్ సిలిండర్ల ధర రూ.9వందల చిల్లర ఉంటుంది. ఇదే అదనుగా భావించి వాణిజ్య ,వ్యాపార అవసరాలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను విచ్చలవిడిగా వాడుతు న్నారు. జిల్లాలో హెచ్‌పి, భారత్, ఇండేన్ తదితర గ్యాస్ ఏజెన్సీలు36 ఉండగా దాదాపుగా ప్రతీ ఇంట్లో గ్యాస్ వినియోగిస్తున్నారు. గృహ వినియోగదారులు మొత్తం ఐదు లక్షల ఎనభైవేల పైచిలుకు ఉన్నారు. అయితే ఇండ్లలో వాడే గ్యాస్ కనెక్షన్ తక్కువ ధరకు వస్తుండటంతో చాలా మట్టుకు హోటల్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మొబైల్ టిఫిన్ సెంటర్లు, దాబాలు, చికెన్ సెంటర్లు, స్వీట్‌హౌజ్ తదితరాల్లో పెద్దమొత్తంలో సబ్సిడీ సిలిండర్లనే వాడుతున్నారు. కేవలం నామ మాత్రంగా అందరికీ కనిపించేవిధంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను ఉంచుతూ లోపలమాత్రం పూర్తిగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. చివరకు పానీపూరీ బండ్ల వద్ద కూడా ఈ సబ్సిడీ గ్యాస్ సిలిండర్లనే వాడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మున్సిపల్ పట్టణాల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉంది. రాంచంద్రాపురం, పటాన్‌చెరు, ముత్తంగి, కంది, సంగారెడ్డి, సదా శివపేట, జహీరాబాద్‌లాంటి పెద్ద పట్టణాల్లో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు పెద్దఎత్తున పక్కదారి పడుతున్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి. రాష్ట్రప్రభుత్వం మహాలక్ష్మీ పథకం కింద సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను ఐదు వందలకే అందచేస్తున్న విషయం తెలిసిందే. మరలాంటి పథకం పటిష్ఠంగా అమలు కావాల్సి ఉండగా అధికారుల ఉదాసీనతవల్ల సబ్సిడీగ్యాస్ సిలిండర్లు వ్యాపార అవసరాలను వినియోగిస్తున్నారు. గతంలో అధికారులు దాడులు చేసి వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను పట్టుకుని, వారికి జరిమానాలు వేశారు. మరోసారి వాడితే కేసులు పెడతామని హెచ్చరించారు. ఇదంతా జరిగి చాలా రోజులు గడుస్తున్నాయి. అయితే ప్రస్తుతం జిల్లా పౌరసరఫరాశాఖలో అవసరంమేరకు సివిల్‌సప్లై డిప్యూటి తహశీల్దారులు లేకపోవటంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. అంతేకాకుండా ఉన్నతాధికారులుకూడా ఈ విషయంలో ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే అభిప్రాయం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్థానిక రెవెన్యూ అధికారుల సమన్వయంతో దాడులు నిర్వహిస్తే కమర్షియల్ సిలిండర్లకు బదులు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వాడకాన్ని నియంత్రించగలుగుతారు. దీనివల్ల ప్రభుత్వానికి కూడా లాభం చేకూరుతుంది.



ఆటోల్లో ఇంటింటికీ తరలిస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు

**అక్రమంగా రీఫిల్లింగ్ దందా?**

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అక్రమంగా రీఫిల్లింగ్ దందా నడుస్తున్నట్లు సమాచారం. నిండు సిలిండర్ల నుంచి ఖాళీ సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా దాదాపుగా కొన్ని నిండు గ్యాస్ సిలిండర్ల నుంచి కొంతకొంత గ్యాస్‌ను ఖాళీ సిలిండర్లలోకి రీఫిల్లింగ్‌చేసి అలా ఖాళీ సిలిండర్లను నింపుతున్నట్లు తెలుస్తుంది. దీంతో గృహ వినియోగదారులకు సరఫరా చేసే నిండు సిలిండర్లలో గ్యాస్ తక్కువగా వస్తుందని పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గృహాలకు ఆటోల్లో గ్యాస్ సిలిండర్లను తరలించేటపుడు సీల్ లేని సిలిండర్లలో గ్యాస్ తక్కువగా ఉంటున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఇలా కూడా గ్యాస్ రీఫిల్లింగ్ చేసి తక్కువమొత్తంలో ఉన్న గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే
## కఠిన చర్యలు తప్పవు

కెసిఆర్ నగర్ డబుల్ బెడ్ రూంలలోని
పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన : జిల్లా కలెక్టర్

**సిద్దిపేట, నవంబరు 23, ప్రభాతవార్త:** సిద్దిపేట పట్టణంలోని కెసిఆర్‌నగర్ డబుల్ బెడ్ రూంలలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ,ప్రాథమిక పాఠశాల(ఉర్దూ మీడియం)లను జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలు డబుల్‌బెడ్ రూంలలో కొనసాగుతుండడంతో చాలా ఇబ్బందులు, సమ స్యలు ఎదురువుతున్నాయని డిఈవో శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్‌దృష్టికి తెచ్చారు. మూడు పాఠశాలలు కలిసి 350పైగా విద్యార్థులు చదువుతున్నారని కెసిఆర్ నగర్ ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఉన్నందున్న శాశ్వత భవనం కోసం ఇంజనీరింగ్ అధికారులతో కావాల్సి న గదుల ఆధారంగా ఎస్టి మేట్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డిఈవోను ఆదేశించారు. అంతకు ముందు కెసిఆర్‌నగర్‌లో గల ఫంక్షన్ హాల్‌ను పరిశీలించి నైపుణ్య శిక్షణ కేంద్రం మూసివేసిన తర్వాత ఎవరూ పట్టించుకోకుండా నిరుపయోగంగా ఉన్నందున ఫంక్షన్‌హాల్ మొత్తం శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్‌ను ఆదేశించారు. ఎవరైనా ప్రభుత్వ భవనాలను, ఆస్తులను ధ్వంసం చేస్తే చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.


పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## అక్రమ భూదందా కేసులో ఇద్దరి అరెస్టు


**కోహెడ, నవంబరు 23,ప్రభాతవార్త :** అక్రమ భూదందాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అభిలాష్ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన రాగుల తిరుపతి, బట్టు రజనీకర్‌రెడ్డి కోహెడ గ్రామానికి చెందిన గూళ్ల బాలయ్య గత 50 యేండ్లుగా గ్రామ శివారులోని వింజపల్లి రోడ్డులో గల రెండు ఎకరాల వ్యవసాయ భూమిని తీగులకుంటపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిదగ్గర సాదాబాయి నామ ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ భూమిని ఉద్దేశ పూర్వకంగా మోసం చేసి తిరుపతి,రజనీకర్‌రెడ్డిలు ఒక్కొక్కరికి ఒక ఎకరం చొప్పున రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ విషయమై గూళ్ళ బాలయ్య కుమారుడు గూళ్ళ చంద్రశేఖర్ ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు. అమాయక రైతులను టార్గెట్ చేస్తూ వారి యొక్క భూములను ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్ చేపిస్తామని వారి నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలి పారు. మోకాపై ఉన్న రైతులను కూడా మోసం చేస్తూ అతనికి కావాల్సి న రిజిస్ట్రేషన్ వీరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. వారి అక్రమాలపై బాధితులు ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.



# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

...గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి
ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం
...రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం
ప్రభాకర్‌గౌడ్

**కోహెడ, నవంబరు 23,ప్రభాతవార్త :** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలకు అనేక పథకాలు అమలు చేస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఆదివారం ఇందిరా మహిళశక్తి చీరల పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పేదల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తుందన్నారు. మహిళా సంఘాలకు 10 యేండ్లుగా లేని వడ్డీలేని రుణాలు ఇవ్వడంతో పాటు మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంటులు, బస్సులు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బొట్టుపెట్టి మహిళా సంఘాల సభ్యులకు చీరలు సారే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉన్న అందరికీ చీరలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మహిళలకు స్పూర్తిదాయకమైనబాట అలవర్చుకొని భవిష్యత్‌లో అర్థికవృద్ధి సాధించి మహిళలు ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు ఒక్కో మెట్టు పూర్తి చేసుకొని ప్రాజెక్టు కంప్లీట్ చేసుకుంటున్నామన్నారు. కాలువల్లో భూములు కోల్పోతున్న రైతుల త్యాగాలతో ప్రాజెక్టు పూర్తి అవుతుందన్నారు. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ కె.హైమావతి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్, డిఆర్‌డిఏపిడి జయదేవ్ ఆర్య, ఆర్డీఓ రామ్మూర్తి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కోహెడ గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయం అవరణలో రూ.10 లక్షలతో నిర్మించతలపెట్టిన కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.


ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

# మహిళల స్వావలంబనే కాంగ్రెస్ ధ్యేయం

...18 సంవత్సరాలు నిండిన ప్రతీ
ఆడపడచుకు ఇందిరమ్మ చీరలు
... రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి
దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, నవంబరు 23, ప్రభాతవార్త:** మహిళల స్వావలంబనే ధ్యేయంగా తమ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, అందులో భాగంగానే మహిళల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మండల పరిధిలోని సంగుపేటలోని ఓ ఫంక్షన్‌హాలులో ఆదివారంనాడు ఏర్పాటుచేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో గతంలో మాదిరిగాకాకుండా వడ్డీలేని రుణాలు మహిళలకు అందచేస్తున్నామని, మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. మహిళాశక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయటం, పెట్రోలుబంకులు మంజూరు చేయటం, షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించటం తదితర పనులద్వారా మహిళలు ఎదిగేందుకు అన్నివిధాలుగా సహాయసహకారాలు అందచేస్తున్నామని తెలిపారు. మహిళా సంగాలకు జిల్లాలో ముప్పైఆరు ఆర్టీసి బస్సులు అందచేయటం జరిగిందని తెలిపారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం కల్పించటంలాంటి బృహత్తర కార్యక్రమాలను తమ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఇకపోతే ఇందిరమ్మ చీరలు ప్రతీ ఆడపడచుకు అందచేస్తామని ఇందులో ఏలాంటి అనుమాలు అవసరంలేదన్నారు. తెల్లరేషన్‌కార్డు ఉండి పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతిఒక్క ఆడపడచుకు ఇందిరమ్మ చీరలు అందచేయటం జరుగుతుందని తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలోని చౌటకూరు, పుల్కల్, వట్‌పల్లి, అందోలు మండలాలకు చెందిన గ్రామాల మహిళలకు ఇందిరమ్మ చీరలను అందచేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, జోగిపేట మాజీ కౌన్సిలర్లు సురెందర్‌గౌడ్, రంగ సురేష్‌గుప్త, జిల్లా, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.


మహిళలకు ఇందిరమ్మ చీరలను అందచేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ


లాటరీ పద్దతిలో వార్డు సభ్యులను రిజర్వేషన్లు తీస్తున్న అధికారులు

### పంచాయతీ ఎన్నికలలో ఏకగ్రీవాలపై తర్జభర్జనలు

**న్యాల్‌కల్, నవంబరు 23, ప్రభాతవార్త:** పంచాయతీ రిజర్వేషన్ల లెక్కను అధికారులు తేల్చేశారు. లాటరీ పద్దతి ద్వారా ఆయా స్థానాలు ఏ కోటాకు వస్తాయో క్లారిటీ వచ్చేసింది. ఇక ఆ స్థానాలలో ఎన్నికల వేడి రాజుకుంది. ఏకగ్రీవం దిశగా ఎన్ని అడుగులు పడతాయి? సై అంటే సై అనేది ఎవరు అనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. మండలంలోని 38 గ్రామ పంచాయితీలకు రిజర్వేషన్‌లను ఆదివారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల సమక్షంలో అధికారుల ఆధ్వర్యంలో ఖరారు చేశారు. ఖరారైన పంచాయితీ రిజర్వేషన్‌ల స్థానాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అమీరాబాద్,అత్నూర్, డప్పూర్, గణేష్‌పూర్, మలిగి, మామడ్డి, మరియంపూర్, మెటల్‌కుంట పంచాయితీలు జనరల్ మహిళలకు రిజర్వే కాగా బసంత్‌పూర్, గుంజోటి, చీకూర్తి, ఇబ్రహింపూర్, కాకిజనవాడ, ఖలీల్‌పూర్, న్యామతాబాద్, రాజోలా, రుక్మాపూర్, శంశల్లాపూర్ పంచాయితీలు జనరల్‌కు రిజర్వు అయ్యాయి. బిసి మహిళలకు ముంగి, ముర్తుజాపూర్, రేజింతల్, టేకూర్ పంచాయితీలు, బిసి జనరల్‌కు రాంతీర్థం, చాల్కి, హద్నూర్, మిర్జాపూర్(బి), రాఘవాపూర్ పంచాయితీలు, చినిగేపల్లి,గంగ్వార్,హుమ్నాపూర్,హుసెల్లి, కల్బేమల్ ఎస్సి జనరల్ స్థానాలకు, ఎస్సి మహిళలకు హుస్సేన్‌నగర్, మిర్జాపూర్(ఎన్), న్యాల్‌కల్, రత్నాపూర్, తాట్‌పల్లి పంచాయితీలు ఖరారు అయ్యాయి.

# కోటా లెక్క తేల్చారు.. పోటీకి దిగేది ఎవరెవరు?

**కోహీర్ మండలంలో ..**

**జహీరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** కోహీర్ మండలంలో పంచాయితీ రిజర్వేషన్ల ఆదివారం అధికారులు ఆయా పార్టీల నాయకుల సమక్షంలో ఖరారు చేశారు. బడంపేట, కవేలి, మాచిరెడ్డిపల్లి, పర్షపల్లి,రాజనెల్లి, సిద్దాపూర్ తండాలు జనరల్ స్థానాలకు, బిలాల్‌పూర్, నాగిరెడ్డిపల్లి, పీచెరాగడి, సజ్జాపూర్ జనరల్ మహిళలకు, చింతల్‌ఘట్, ఖానాపూర్, మనియార్‌పల్లి, వెంకటాపూర్ పంచాయితీలు ఎస్సీ జనరల్‌కు, ఎస్సీ మహిళలకు పోతిరెడ్డిపల్లి, మద్రి,గురుజువాడ, బిసి జనరల్‌కు దిగ్వాల్, బిసి మహిళలకు కొత్తూర్(కె), కొత్తూర్(డి) పంచాయితీలు, ఎస్టీ జనరల్‌కు గిటిగార్‌పల్లి, పాచరాగడి తండాలు రిజర్వు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

**కంది మండలంలో..**

**కంది, నవంబరు 23, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామ పంచాయితీలకు రిజర్వేషన్‌లను ఆదివారం అధికారులు పార్టీల నాయకుల సమక్షంలో ఖరారు చేశారు. ఖరారైన పంచాయితీల రిజర్వేషన్‌లు ఇలా ఉన్నాయి. ఎస్‌సి జనరల్‌కు ఆరుట్లా, ఇంద్రకరణ్ పంచాయితీలు, ఎస్సీ మహిళలకు ఎర్దనూర్, ఎద్దుమైలారం పంచాయితీలు, బిసి జనరల్‌కు చిద్రుప్ప, మక్తాఆలూర్ పంచాయితీలు, బిసి మహిళలకు తోపుగొండ, ఉత్తరపల్లి పంచాయితీలు, ఎస్‌టి జనరల్ స్థానాలకు తుణికల తండా, వడ్డెనగూడ, ఎస్టీ మహిళలకు బ్యాతోల్, ఎర్దనూర్‌తండా పంచాయితీలు, జనరల్ మహిళలకు బేగంపేట, చేరాలగూడెం, చేర్యాల, కవలంపేట, మామిడిపల్లి పంచాయితీలు, జనరల్ స్థానాలకు చిమ్నాపూర్, జూకల్, కంది, కలివేముల, కాశీపూర్ పంచాయితీలు రిజర్వు అయినట్లు అధికారులు ప్రకటించారు.

**నంగునూర్ మండలంలో ..**

**నంగునూర్, నవంబరు 23,ప్రభాతవార్త :** మండల పరిధిలోని 25 గ్రామా పంచాయతీల రిజర్వేషన్లను రెవెన్యూ అధికారులు ఖరారు చేశారు. మండల పరిధిలోని సంతోష్‌నగర్(ఎస్టీ జనరల్), ముగ్దంపూర్,నంగునూర్, ఘనపూం (ఎస్సీ జనరల్),ఖాతా, బద్దిపడగా(ఎస్సీ మహిళా), ఖానాపూర్, పాలమాకుల ,సిద్దన్నపేట(బీసీ జనరల్), రాజగోపాల్‌పేట,అంక్షాపూర్, ముంద్రాయి(బీసీ మహిళా), రాంపూర్, మైసంపల్లి, నాగరాజ్‌పల్లి,గట్లమల్యాల, అప్పలాయ చెరువు,వెంకటాపూర్,తిమ్మాయిపల్లి( జనరల్), జెపి తండా, కొండరాజ్‌పల్లి,నర్మెట, అక్కెనపల్లి,దర్గాపల్లి, కోనాయపల్లి(జనరల్ మహిళ)లకు కేటాయించారు.

**సిర్గాపూర్‌లో..**

**సిర్గాపూర్, నవంబరు 23, ప్రభాతవార్త:** అఖిలపక్ష రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఆదివారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో లాటరీ పద్దతితో 28 పంచాయితీల్లోని 226 వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. 50 శాతం మహిళలకు రిజర్వేషన్‌ల ప్రక్రియపై లాటరీ పద్దతిలో రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు సూపరింటిడెంట్ శ్రీనివాస్, ఎంపిఓ బ్రహ్మయ్యలు తెలిపారు.

**కందిలో..**

**కంది, నవంబరు 23, ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురష్కరించుకుని పంచాతీలలో వార్డులలో మహిళా రిజర్వేషన్‌లను లాటరీ పద్దతిలో అఖిలపక్ష నాయ కుల సమక్షంలో అధికారులు ఆది వారం ఖరారు చేశారు. మండలం లోని ఆయా పంచాయితీలలోని 212 వార్డులకు గాను 87 వార్డులను మహిళలకు కేటాయించారు. 33 ఎస్‌టిలకు, 19 జనరల్‌కు, 14 మహిళలకు కేటాయించారు. ఎస్సీలకు కేటాయించిన 37 స్థానాలలో 25 జనరల్‌కు, 12 మహిళలకు కేటాయించారు. జనరల్ కోటాలో 99 స్థానాల్లో 52 జనరల్‌కు, 42 జనరల్ మహిళలకు కేటాయించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ నాయకులు రఘుగౌడ్, సంగారెడ్డి, శ్రీధర్, మధుసూదన్‌రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.


కందిలో లాటరీ పద్దతిలో రిజర్వేషన్‌లను ఖరారు చేస్తున్న దృశ్యం

**ఆర్‌డిఓ సమక్షంలో రిజర్వేషన్ల ఖరారు**

**జహీరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** త్వరలో జరుగబోయే పంచాయితీ ఎన్నికలను పురష్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయంలో రిజర్వేషన్‌లను ఆర్‌డిఓ దేవుజ నాయక్, తహసీల్దార్ పి దశకథ్‌ల ఆధ్వర్యంలో అఖిల పక్ష రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఖరారు చేశారు .వార్డులకు సంబందించి రిజర్వేషన్‌లను ఎంపిడిఓ ఖరారు చేశారు. ఖరారైన పంచాయితీల రిజర్వేషన్‌లు ఇలా ఉన్నాయి. జనరల్ స్థానంలో అల్‌గోల్, ఆనెగుంట, బూర్దిపాడ్, రాయిపల్లి (డి), జనరల్ మహిళలకు దిడిగి, గోవిందపూర్, హుగ్గెల్లి, తూంకుట, బిజి జనరల్‌కు సత్వార్, శేఖాపూర్, బిసి మహిళలకు కొత్తూర్(బి), మల్చల్మ, ఎస్సీ జనరల్‌కు హోతి(బి), కాశీంపూర్, ఎస్సీ మహిళలకు చిరాగ్‌పల్లి, బూచినెల్లి, ఎస్టీ జనరల్‌కు లచ్చునాయక్‌తండా, మల్చల్మ తండా, శేఖాపూర్ తండా, ఎస్టీ మహిళలకు అర్జున్ నాయక్ తండా, మదురై తండాలు ఖరారు అయ్యాయి.


సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్‌లు ఖరారు చేస్తున్న అధికారులు, నాయకులు జహీరాబాద్‌లో

**-మొగుడంపల్లి మండలంలో...**

జనరల్ స్థానానికి ఔరంగానగర్, గుడ్‌పల్లి, కామ్‌జమాల్‌పూర్, రాయిపల్లి తండా, జనరల్ మహిళలకు అసద్‌గంజ్, గోటిగార్‌పల్లి, ఇప్పేపల్లి, బిసి జనరల్‌కు మొగుడంపల్లి, మాడ్గి, బిసి మహిళలకు గౌసాబాద్, ఎస్సీ జనరల్‌కు గోపన్‌పల్లి, జాడిమల్కాపూర్, ఎస్సీ మహిళలకు ధనసిరి, ఎస్టీ జనరల్‌కు సున్నంబట్టి తండా, గౌసబాద్‌తండా,మిర్జాంపల్లితండా, పడియాల తండా, సజ్జారావుపేట తండా, విట్టునాయక్ తండా, ఎస్సీ మహిళలకు హరిచంద్‌నాయక్ తండా, మన్నాపూర్, జూమ్గర్‌బోలి తండాలు రిజర్వు అయ్యాయి.



సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

## ఘనంగా భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి

**సరూర్‌నగర్, నవంబరు 23 ప్రభాతవార్త:** నగర శివార్లలోని మీర్‌పేట్‌లో ఆదివారం భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మీర్‌పేట్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సందర్భంగా సాయిబాబా భక్తులు వంద రకాల ప్రసాదాల నైవేద్యం సమర్పించారు. అదేవిధంగా 100 నిమిషాల పాటు వంద భజన పాటలను ఆలపించారు. అంతకుముందు ఓంకారం, సుప్రభాతం, రుద్రం, సహస్రనామార్చన, నారాయణ సేవ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మీర్‌పేట్ పురవీధుల్లో స్వామి వారి పల్లకీ సేవను భక్తి శ్రద్ధలతో జరిపారు. కార్యక్రమాల్లో సభ్యులు శివానందం, కృష్ణమూర్తి, ఎర్రయ్య, అంబా శంకర్, రవి, గంగా రామకృష్ణ, నారాయణరావు, వెంకట కృష్ణారావు, పెద్ద సంఖ్యలో సాయిభక్తులు పాల్గొన్నారు.

## గుర్రం లక్ష్మారెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు: పారిజాత



గుర్రం లక్ష్మారెడ్డికి నివాళులర్పిస్తున్న పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, నవంబరు 23 ప్రభాతవార్త:** కాంగ్రెస్‌నాయకుడు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ గుర్రం లక్ష్మారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం గుర్రంగూడలో జరిగిన లక్ష్మారెడ్డి పెద్ద కర్మ కార్యక్రమానికి ఆమె హాజరై నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, గొరిగె అయిలమ్మ, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జెల్ల రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు.. పాల్గొన్న కార్పొరేటర్



ప్రార్థనల్లో పాల్గొన్న కార్పొరేటర్ విజయారెడ్డి

**జూబ్లీహిల్స్, నవంబరు 23, ప్రభాతవార్త :** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఈద్గా గ్రౌండ్ ఎంఎస్ మక్తాలోగల దర్గాలో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాల్లో టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహించిన ప్రార్థనలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో తహబాయ్, మహమ్మద్ రఫీ, నాసర్, అంజద్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నికృష్ణన్ పార్కులో ఆటవస్తువుల ఏర్పాటు



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

**నిజాంపేట్, నవంబర్ 23, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానందగౌడ్ సహకారంతో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ 22వ డివిజన్ వాసవి లేఅవుట్‌లోని ఉన్నికృష్ణన్ పార్కులో ఆదివారం చిల్డ్రన్స్ ఎక్విప్‌మెంట్, సెంట్రల్ లైటింగ్‌ను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేయడం జరిగింది. మున్సిపల్ అధికారులు సమకూర్చిన జెసిబి సహాయంతో ఉన్నికృష్ణన్ పార్కు అసోసియేషన్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పార్కును మొత్తం లెవెలింగ్ చేసి అందులో ఉన్న రాళ్లను బయటికి పంపించడం జరిగింది. కమిటీ సభ్యులు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జెసిపి దగ్గర ఉండి పార్కులో ఉన్న రాళ్లను ట్రాక్టర్ సాయంతో బయటికి పంపించి మట్టిని చదును చేయించడం జరిగింది. కార్యక్రమంలో సాంబశివారెడ్డి తదితరులు పర్యవేక్షి ంచారు.

## ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో రామంతాపూర్ బిఆర్ఎస్ నేతల బేటి

**ఉప్పల్, నవంబరు 23 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో ఆదివారం రామంతాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పని చేసే కార్యకర్తలకు తప్పకుండా తగిన ప్రాధాన్యత కల్పిస్తానని తెలిపారు. డివిజన్ అధ్యక్ష పదవిలో అన్ని కోణాలలో ఆలోచించి తగు నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు ఇవ్వాలని పలువురు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు పాలకూరి శ్రీకాంత్ గౌడ్, సంబెటి నరేష్, సూరం శంకర్, చాంద్ పాషా, ఆపిల్ శ్రీను, మారుతీ జాదవ్, తుఫాన్, రామకృష్ణ, శరత్, పెయింటర్ శ్రీను, సుధాకర్, శివ, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నేతలు

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలి

### తెలంగాణ బిసి సంఘాల జెఏసి చైర్మన్ ఓరుగంటి వెంటకేష్‌గౌడ్



మాట్లాడుతున్న ఓరుగంటి వెంకటేశంగౌడ్

**సైఫాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జివొనెంబరు 46ను ఉపసంహరించుకుని బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని తెలంగాణ బిసి సంఘాల జెఏసి చైర్మన్ ఓరుగంటి వెంటకేష్‌గౌడ్ డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లపై హైకోర్టులో సోమవారం వాదనలు ఉన్నప్పటికి ప్రభుత్వం హడావుడిగా జివొ నెంబరు 46ని తీసుకురావాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ఎన్నికల ముందు ఎఐసిసి నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పారని, అధికారంలోకి వచ్చి రెండేళ్ళు గడిచినా 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకుండా ఎస్సీ, ఎస్టీ, బిసిలకు కలిపి 50 శాతం రిజర్వేషన్‌ల లోపుతో ఎన్నికలు నిర్వహించడం బిసిలను నిలువునా మోసం చేయడమేనని ఆయన ధ్వజమెత్తారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించడంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు కావాలని మోసం చేస్తున్నాయని, వచ్చే స్థానిక సంస్థల, జిహెచ్ఎంసి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన బిసిలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిసి నేతలు కోలా జనార్ధన్, సారంగ అనితాగౌడ్, సోమేశ్వర్, సంగమేశ్వర్, రాములు తదితరులు పాల్గొన్నారు.



చెవిలో పువుపెట్టుకుని జివొ నెంబరు 46 కాపీలను చించేస్తున్న రామకృష్ణ

## జీవో నెంబరు 46ను రద్దుచేయాలని బిసిల వినూత్న నిరసన

**హైదరాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త :** బిసిల రిజర్వేషన్‌లపై రాష్ట్ర ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ఆరోపిస్తూ అనేక మంది బిసిలు ఆదివారం నాడిక్కడ చెవిలో పువ్వులు పెట్టుకుని, నల్ల కండువాలు ధరించి, జివొ నెంబరు 46 కాఫీలను చించివేస్తూ వినూత్న ప్రదర్శన నిర్వహించారు. జివొ నెంబరు 46ను ఉపసంహరించుకోవాలని, 42 శాతం రిజర్వేషన్‌లతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిసిలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ మాట్లాడుతూ బిసిలకు రెండు సంవత్సరాలుగా 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ప్రభుత్వం పదే పదే ప్రకటించి, జివొ నెంబరు 46ను విడుదల చేసి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం కులగణనను బయటపెట్టడంలేదని, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్ళడం లేదని, ఇండియా కూటమి ఎంపిలు పార్లమెంట్‌లో చర్చించడం లేదని ఆయన నిశితంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిసి రిజర్వేషన్‌నలను 9వ షెడ్యూల్డ్‌లో పెట్టించాలని ఆయన డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్‌లు వచ్చేంతవరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించరాదని, తక్షణమే జివొ నెంబరు 46ను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

## సాగర తీరం బాల గేయాల పుస్తకం ఆవిష్కరణ



సాగర తీరం అను బాలాగేయాల పుస్తకాని ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబరు 23(ప్రభాతవార్త):** ప్రముఖ రచయిత గద్వాల సోమన్న రచించిన సాగర తీరం అను బాలాగేయాల పుస్తకావిష్కరణ సభ ఆదివారం సంగీత సాహిత్య సాంస్కృతిక సమన్వయ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వి.డి.రాజగోపాల్ నిర్వహణలో జరిగింది. ప్రతి నెల జరుపుకునే కార్యక్రమంలో భాగంగా అంతర్జాల వేదికపై భగవాన్ పుట్టపర్తి సాయిబాబా, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, దాశరథి,అబ్దుల్ కలాం, అందెశ్రీలను స్మరించుకుంటూ కవిసమ్మేళనం జరిగింది. అనంతరం గద్వాల సోమన్న రచించిన సాగరతీరం అను బాలాగేయాల పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ప్రముఖ గాయకుడూ శరత్ చంద్ర, రవీంద్రబాబు గానామృతంతో అలరించారు. డా. వోలేటి పార్వతీశం ముఖ్యఅతిథిగా, డా.నాళేశ్వరం శంకరం, డా.దుర్గాప్రసాద్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎం సిద్ధారెడ్డి, ఎ.ఎల్.కృష్ణారెడ్డి, డాక్టర్ ఎన్ వెంకటరమణ, పి. బయ్యపు రెడ్డి, ఎ.వి.సుబ్రహ్మణ్యం, ప్రతికంఠం విజయ రామ రాజు, .డాక్టర్ ఉషా రాణి కోగంటి,శ్రీమతి ఎన్ విజయలక్ష్మి ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిద్ధిబుద్ధి గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

**చిక్కడపల్లి నవంబరు 23 (ప్రభాతవార్త):** నగరంలో ప్రసిద్ధిగాంచిన వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో సిద్ధి బుద్ధి సహిత గణపతి, దత్తసాయి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఆలయం చైర్మన్ జానకి సుధాకర్ ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామికి వాహనమైన ఒంటె విగ్రహం, ప్రాణ ప్రతిష్ట చేశారు. ఇదే కార్యక్రమంలో 160 కేజీల వెండి తో సంజీవని కొండ, స్వామి వారికి వెండి కవచం సింహాసనం, రెండు మకర తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఇవే కాకుండా సీతా రామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామికి పంచలోహ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఎంతో అద్భుతంగా సాగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్,దేవాదాయ ధర్మాదాయశాఖ అదనపు కమీషనర్ ఎం శ్రీనివాసరావు, గాంధీనగర్ కార్పొరేటర్ ఏ పావని వినయ్ కుమార్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, చిక్కడపల్లి ఏసీబీ ఎల్ రమేష్ కుమార్, ఆలయం మాజీ చైర్మన్ గంగం రవి, టిఆర్ఎస్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఏ వినయ్ కుమార్, టిఆర్ఎస్ యువ నేత ముఠా జయసింహ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీ ్మపతి శర్మ, కందాల వెంకటాద్రి, ధర్మకర్తలు వెంకట్రావు, రామకృష్ణ, పద్మావతి, మురికి గణేష్, శ్యాం ముదిరాజ్, శిశు కుమార్, నిర్మల, బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వినయ్ కుమార్

## బిజెపి గాంధీనగర్ డివిజన్ కార్యవర్గ సమావేశం

**చిక్కడపల్లి నవంబరు 23 (ప్రభాతవార్త) :** రాబోయే రోజుల్లో గాంధీనగర్ డివిజన్ బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించబోయే ముఖ్య కార్యక్రమాల కార్యాచరణ సమావేశం డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం, అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి సికింద్రాబాద్ పార్ల మెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, హంకాళి జిల్లా అధికార ప్రతినిధి, దిశా కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో డివిజన్ లో చేపట్టవల్సిన కార్యక్రమాలు వివరించారు. వందేమాతరం 150 సంవత్సరాలు, సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి 150వ జయంతి, ఆత్మ నిర్భర్ భారత్, మరియు బూత్ కమిటలు వంటి అంశాల పై చర్చించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర పార్టీ సూచనల మేరకు జరగబోయే కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, పార్టీ కార్యక్రమాలతో పాటు డివిజన్ లోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగాడివిజన్ బిజెపి నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా రాబోయే జి హెచ్ ఎం సి ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ స్థానాలలో విజయం సాధించి ఖచ్చితంగా మేయర్ స్థానాన్ని బిజెపి కైవసం చేసుకుంటుందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు రత్న సాయి చంద్, శ్రీకాంత్, విష్ణు రాజు, దామోదర్, ఎం.ఉమేష్, సురేష్ రాజు, ఆనంద్‌రావు, విజయలక్ష్మి ్మ, సంయుక్తరాణి, డివిజన్‌లోని పదాధికారులు,ముఖ్య నాయకులు,మోర్చల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## బిజెపి అడిక్‌మెట్ డివిజన్ కార్యవర్గ...

**చిక్కడపల్లి నవంబరు 23 (ప్రభాతవార్త):** బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ కార్యవర్గ సమావేశం డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. పార్టీయే నగర కమిటీ ఆదేశాల మేరకు జరిగిన సమా వేశంలో రాబోయేరోజుల్లో పార్టీ ఆదేశానుసారం వివిధ అభియాన్లలో చురుకుగా పాల్గొనాలని విజయవంతం చేయాలని నిర్ణయించడం జరిగింది.సర్దార్ పటేల్ అభియాన్, మన్ కి బాత్ ప్రోగ్రాం యోజన, ఆత్మ నిర్భర్ భారత్ ఉద్యమ ప్రోగ్రామ్ యోజన, సంస్థ గత విషయాలు ఇవాళ చర్చించి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆత్మ నిర్భర్ భారత్ యోజనలో భాగంగా స్వదేశీ ఆత్మనిర్భర్ ప్రత్యక్ష చేయడం జరిగింది. ముఖ్య అతిథిగా పార్టీ రాత్రి కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయి ప్రసంగించారు. రాబోయేరోజుల్లో ప్రతి ప్రోగ్రాం జయప్రదం చేయాలని డివిజన్ అధ్యక్షుడు సాయి కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు.

## వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి

**చిక్కడపల్లి నవంబర్ 23 (ప్రభాతవార్త):** సుందరయ్య పార్క్ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ముషీరాబాద్ శాసనసభ్యుడు ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం వాకర్స్‌క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్. మనోహర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ను మద్యదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు పివి నిరంజన్ రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు నాగభూషణం, క్లబ్ పూర్వ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, వివేక్, శైలజమోహన్, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నగర క్రీడాకారుల ప్రతిభ

**చిక్కడపల్లి నవంబర్ 23(ప్రభాతవార్త):** రాష్ట్ర బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. ఆదివారం యోనెక్స్, సన్ రైస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్ 11 బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2025 టోర్నమెంట్‌లో మ్యాచ్‌పాయింట్ అకాడమీ క్రీడాకారులు సత్తాచాటారు. క్రీడాకారులు లట్టాల శాన్వి, ఎవిలిన్ ప్రియాంక్ జోడి డబుల్స్ విభాగంలో అద్భుతమైన ఆటతో ద్వితీయ స్థానం గెలుచుకున్నారు. అద్భుతమైన ఆట తీరుతో ఫైనల్ కి చేరుకున్న ఈ జోడి నువ్వా నేనా అంటూ సాగిన చివరి మ్యాచ్ లో స్వల్ప తేడాతో ఓడిపోయి సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్, హెడ్ కోచ్ వేణు ముప్పాల మాట్లాడుతూ.. అద్భుతమైన ఆటను ప్రదర్శించారని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.కార్యక్రమంలో కోచ్ రాధాకృష్ణ, మ్యాచ్ పాయింట్ కోచింగ్ సిబ్బంది వినోద్ ,సిద్ధూ,శివ తదితరులు పాల్గొన్నారు.





క్రీడాకారులను అభినందిస్తున్న హెడ్ కోచ్ వేణు తదితరులు

## ఉత్పాదకతకు కొత్త నిర్వచనం ఇస్తున్న జెన్ జీ

**జూబ్లీహిల్స్, నవంబరు 23, ప్రభాతవార్త**

హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెన్ జీ, పని ప్రదేశంలో ఉత్పాదకత అనే అంశంపై ఒక ప్రత్యేక సదస్సు నిర్వహించారు. స్టూడెంట్ ట్రైబ్ వ్యవస్థాపకులు, సీఈఓ చరణ్ లక్కరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఆధునిక ఉద్యోగ వాతావరణంలో జెన్ జీ(యువతరం) తీసుకువస్తున్న మార్పులపై మాట్లాడారు. సంస్థ యాజమాన్యాలు ఇకపై పర్యవేక్షణకు బదులు కోచ్‌లుగా మారి, ఉద్యోగులకు స్వేచ్ఛ, వెసులుబాటు, విశ్వాసం కల్పించే వాతావరణాన్ని సృష్టిస్తే వారి నిజమైన పనితీరు వెలుగులోకొస్తుందన్నారు. సమాజంలో ఉన్న అసహనం, అలజడి, శ్రద్ధలేమిలాంటి అభిప్రాయాలు వాస్తవం కాదని ఆయన స్పష్టం చేశారు. జెన్ జీ తరం లోతైన అవగాహన, ఆధ్యాత్మికత, ఆరోగ్య అవగాహన, ప్రభావం ఆధారిత దృక్కోణం కలిగినవారన్నారు. వారు తక్కువ ఉత్పాదకత కలవారు కారని, వేరే విధమైన ఉత్పాదకత చూపిస్తూ, శరవేగంగా ఎదగాలని, అందరితో స్వేచ్ఛగా మాట్లాడాలని భావిస్తారని, అలాగే వ్యక్తిత్వానికి గౌరవం కోరుకుంటూ నిజాయతీతో కూడిన పని సంస్కృతి కావాలనుకుంటారని ఇవే జెన్ జీ ప్రధాన ప్రాధాన్యాలని లక్కరాజు వివరించారు. ఈ మార్పులను అర్థం చేసుకొని సంస్థలు తమ విధానాలను మార్చుకుంటే, జెన్ ఏఐ యుగంలో మానవ వనరుల పూర్తి సామర్థ్యాన్ని సంస్థలు వెలికితీయగలవని అన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎంఏ అధ్యక్షుడు అల్వాల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ యువతకు సాధికారత కల్పించేందుకు హెచ్ఎంఏ కట్టుబడి ఉందని చెప్పారు. దీనికి ఆంత్రప్రెన్యూరియల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తామని, జెన్‌జీ తరం ఆశయాలకు అనుగుణంగా ఇతర చర్యలను రూపొందిస్తామన్నారు. కార్య క్రమంలో హెచ్ఎంఏ కార్యదర్శి వాసుదేవన్ జి పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న చరణ్ లక్కరాజు ఇతర సభ్యులు



సమావేశంలో అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

## 4 కోడ్‌లకు వ్యతిరేకంగా 26న ధర్నా

**సైఫాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 26న ఇందిరాపార్కు వద్ద ధర్నా కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని పలు కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో కార్మిక సంఘాల నాయకులు ఎం.డి.యూసఫ్ జనకప్రసాద్, ఆర్‌డి చంద్రశేఖర్, విజయ్ కుమార్, పాలడుగు భాస్కర్, కె.సూర్యం, కె.శ్రీనివాస్, రాంబాబు, క్రిష్ణ, భరత్ మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం దారుణంగా 4 కోడ్‌లు చేసి కార్మికులకు అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. తక్షణమే 4 కోడ్‌లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. 26వ తేదీన జరిగే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## 25న పెన్షనర్ల సదస్సు

**సైఫాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త:** అఖిల భారత పెన్షనర్ల సంఘాల పిలుపు మేరకు ఈ నెల 25వ తేదీన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలిపింది. ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ సబ్ కమిటీ కన్వీనర్ ఎం.జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సులో ఇపిఎఫ్, సిబిటి సభ్యుడు ఆర్.కరుమలయన్, ఎఐఎస్‌జిఇఎఫ్ జనరల్ సెక్రటరీ శ్రీకుమార్, ఎంవిఎస్ శర్మ తదితరులు పాల్గొంటారని చెప్పారు. అప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోతే డిసెంబరు 9, 10 తేదీలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పద్దతిలో పెన్షన్ విధానాని ్న పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టి.బాలగంగాధర్‌రావు, స్వరాజ్‌కుమార్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 3న సరూర్‌నగర్‌లో భారీ బహిరంగ సభ

### రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు గాలి వినోద్‌కుమార్

**సైఫాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ జనవరి 3వ తేదీన సరూర్‌నగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల అసైన్డ్ భూములకు యాజమాన్యం హక్కులను ప్రభుత్వం కల్పించి, నీటి వసతి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందని ఆరోపించారు. అసైన్డ్ భూములకు తక్షణమే యాజమాన్యం హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ధరణి పేరిట పేదల భూములను గుంజుకున్నదని, కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ బిసిల ద్రోహుల పార్టీలని ఆయన ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్ ఆయన సమక్షంలో ఆర్‌పిఐలో చేరారు.

## ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద వహించాలి

### - నార్సింగి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్

**నార్సింగి, నవంబరు 23 ప్రభాతవార్త :** ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద వహించాలని నార్సింగి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేష్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నార్సింగిలో జస్మిన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వెంకటేష్‌యాదవ్ వెళ్లి ప్రజలతో పాటు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేగంగా నగరీకరణ చెందుతున్న గ్రామాలలో ప్రజలు యాంత్రిక జీవనానికి అలవాటుపడి ఆరోగ్యాన్ని అశ్రద్ద చేస్తున్నారని అన్నారు. నడక, ఆసనాలు, యోగ, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు వంటివి దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందం నార్సింగికి రావడం సంతోషంగా ఉందని, ప్రజలకు పరీక్షలు, వైద్యం, మందులు అన్ని పూర్తి ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని వెంకటేష్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య నిపుణులు, ప్రజలు పాల్గొన్నారు.

## బాచుపల్లి తెలుగు వర్సిటీ కళామందిరానికి శంకుస్థాపన

**నిజాంపేట్, నవంబరు 23, ప్రభాతవార్త :** తెలుగు భాష సాహిత్యల విస్తృతికి విశేషంగా కృషి చేస్తూ, పరిశోధనల ద్వారా విద్యార్థులకు తెలుగు భాష పట్ల మక్కువను పెంచుతూ వారిలో సృజనాత్మకతను పెంచనున్న తెలుగు విశ్వవిద్యాలయం బాచుపల్లిలోని నూతన ప్రాంగణంలో సకల సదుపాయాలతోకూడిన కళామందిర నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కళామందిరం నిర్మాణానికి అయ్యే ఐదు కోట్ల ఖర్చులో అధిక మొత్తాన్ని విరాళంగా అందజేసిన శాంతా బయోటెక్నిక్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ కెఐ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 500 మంది అతిథులు కూర్చునే విధంగా నిర్మిస్తున్న ఈ ఆడిటోరియం వచ్చే ఏడాదిలోగా పూర్తికానున్నదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్య సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఐ గణపతి రెడ్డి, విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు నిత్యానందరావు, రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు, ఇంజనీర్ రామకృష్ణం రాజు, ఆర్థిక అధికారి సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

### పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో

## ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టా మహోత్సవం

**నిజాంపేట్, నవంబర్ 23, ప్రభాతవార్త :** బ్రహ్మశ్రీ కె.సుబ్రహ్మణ్య మూరారిశర్మ ఆధ్వర్యంలో శ్రీలలితా త్రిపురసుందరీ సమేత మహో మృత్యుంజయేశ్వర(మరకత లింగం) సహిత నందీశ్వర, సుబ్రహ్మణ్యస్వామి, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టా మహోత్సవం ఘనంగా నిర్వహించినున్నట్లు ఆలయ చైర్మన్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి, ఆలయ ప్రెసిడెంట్ సభ్యులు చావలి సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజాంపేట్, 12వ డివిజన్, బాలాజీహిల్స్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2లోని పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు త్రయాహ్నిక దీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేడు ఉదయం 8 గంటల నుండి గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ఋత్విక్ వరుణం, గ్రామ ప్రదక్షణం, పంచగవ్య ప్రాశనం, దీక్షాధారణం, అఖండ దీపారాధన, వాస్తుపర్యగ్నికరణం, ఆకురారోపణం, యాగశాల ప్రవేశం, హారతి మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30గంటలకు అన్న సమారాధన నిర్వహించనున్నారు. సాయంత్రం 04:30 గంటల నుండి అగ్ని మథనం, అగ్నిప్రతిష్ఠ, గణపతిహోమం, ఆవాహిత మంటప దేవత ఆవాహనం, కలశస్థాపనం, మంటప దేవతాపూజ, కర్కరీస్థాపనం, ప్రతిష్ఠా హోమాలు, వేదపారాయణం, జలాధివాసం, హారతి మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## వికాస్ ది కాన్సెప్ట్ స్కూల్‌లో ఉల్లాసస్య ఉత్సవం

**నిజాంపేట్, నవంబరు 23, ప్రభాతవార్త :**

బాచుపల్లి వికాస్ ది కాన్సెప్ట్ స్కూల్‌లో అంగరంగ వైభవంగా ఉల్లాసస్య ఉత్సవం.. ఆహ్వాన నృత్యంతో కనుల పండువగాసాగింది. లెఫ్టనెంట్‌గా నౌకాదళంలో పదవిని అధిరోహించి, తాను చదువుకున్న స్కూల్‌కి అతిథిగా ఆహ్వానాన్ని అందుకుని కల్లి జితేంద్ర రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కల్లి దుర్గాకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్స్‌పాల్ శ్రీవేణి, ప్రైమరీ హెడ్ మిస్ట్రెస్ బిను అబ్రహం, కోఆర్డినేటర్ కనకరాజు, డైరెక్టర్ నందకిశోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్లి జితేంద్ర రెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకి అతిథిగా రావడం చాలా ఆనందంగా ఉన్నదని అన్నారు. తన తండ్రి తాను చదువుకునే రోజుల్లో ఫిజిక్స్ హెచ్ఓడిగా చేసేవారని, ఉపాధ్యాయుల శ్రద్ద వల్ల మాలాంటివాళ్ల ఒక మంచి స్థాయికి చేరుకోగలుగుతామని, పట్టుదల కృషి ఉంటే మనం అనుకున్న గమ్యానికి చేరుకోవచ్చని అన్నారు. తనకు చదువు చెప్పి ప్రోత్సహించిన టీచర్స్ ముందు అతిథిగా ఇలా వచ్చి మాట్లా డటం నాకు చాలా ఆనందంగా ఉన్నదన్నారు. ఆభరణాల స్టాల్ మొదలు, అన్ని రకాల ఆహార పదార్థాలు, ఆటల స్టాల్స్ నుంచి ఆర్ట్ గ్యాలరీ నిర్వహించారు.

## మండలంలో సర్పంచ్‌ల రిజర్వేషన్ల ఖరారు

**నంగునూర్, నవంబరు 23,ప్రభాతవార్త :**
మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీల రిజర్వేషన్లను రెవెన్యూ అధికారులు ఖరారు చేశారు. మండల పరిధిలోని సంతోష్‌నగర్(ఎస్టీ జనరల్), ముగ్దంపూర్,నంగునూర్,ఘనపూర్(ఎస్సీ జనరల్),ఖాతా, బద్దిపడగా(ఎస్సీ మహిళా),ఖానాపూర్,పాలమాకుల,సిద్దన్నపేట(బీసీ జనరల్),రాజగోపాల్‌పేట,అంక్షాపూర్,ముండ్రాయి(బీసీ మహిళా), రాంపూర్,మైసంపల్లి,నాగరాజ్‌పల్లి,గట్లమల్యాల,అప్పలాయచెరువు ,వెంకటాపూర్,తిమ్మాయిపల్లి(జనరల్),జెపితండా,కొండరాజ్‌పల్లి, నర్మెట, అక్కెనపల్లి,దర్గాపల్లి,కోనాయపల్లి(జనరల్ మహిళ)లకు కేటాయించారు.

## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు ధ్యేయం

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు: మహేందర్‌యాదవ్**




**చిన్నకోడూరు, నవంబరు 23,ప్రభాతవార్త:** కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని..ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ కానుక ఇందిరమ్మ చీర అందించడం జరుగుతుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని అల్లీపూర్‌లో ఆదివారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ మహిళల ఆత్మగౌరవం పెంచే విధంగా నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తుందన్నారు. పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలువాలన్నారు.కార్యక్రమంలో సీఎలు రాణి, సమత, వీవో లీడర్లు అర్చన, పావని, కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మహంకాళి యాదగిరి, శానకొండ రాజు, కోడల నాగరాజు,మహంకాళి మల్లేశం, ఇర్మల్ల ముత్యం, కామ మహేష్‌బాబు, భూమయ్య, ఉడుత ఎల్లయ్య, మీసం కనకయ్య, మీసం పెద్ద ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో రేపు వాహనాల పార్కింగ్ వేలం

**కొమురవెల్లి, నవంబరు 23, ప్రభాతవార్త :**
మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతర సందర్భంగా ఈనెల 25న వాహనాల పార్కింగ్ కోసం వేలం వేయడం జరుగుతుందని గ్రామ కార్యదర్శి ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని కొమురవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం అవరణలో ఉదయం 10.30కి గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయి ఉండరాదన్నారు. ఇతర గ్రామం నుంచి వేలం పాటలో పాల్గొనే వారు తమ గ్రామ పంచాయతీ నుంచి సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకరావాలన్నారు. వేలం పాటకు ముందు గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ చెల్లించాలన్నారు. వాహనాల పార్కింగ్ డిపాజిట్ రూ.20 వేలు చెల్లించి వేలం పాటలో పేరు నమోదు చేయించుకోవాలన్నారు. వేలం పాట దక్కించుకున్న వారు మూడు రోజుల్లో 50 శాతం డబ్బులు చెల్లించాలన్నారు. మిగితా డబ్బు 15 రోజుల్లో చెల్లించాలన్నారు.

## ఎన్నికల కోసం కాంగ్రెస్ సర్కార్ కొత్త డ్రామా

**బిఆర్ఎస్ సీనియర్ నాయకులు : మహేష్**

**కొమురవెల్లి, నవంబరు 23, ప్రభాతవార్త :**
స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసం కాంగ్రెస్ సర్కార్ చీరల పంపిణి పేరిట కొత్త డ్రామాకు తెరలేపిందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రుల మహేష్ మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన రెండు యేండ్ల నుంచి గుర్తుకు రానీ మహిళలు స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. బిఆర్ఎస్ సర్కారు అధికారంలో ఉన్నంత కాలం బతుకమ్మ పండుగకు చీరలు పంపిణీ చేస్తే కాంగ్రెస్ సర్కారు స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో చీరల పంపిణీకి శ్రీకారం చుట్టడం ఏమిటని ప్రశ్నించారు. బిఆర్ఎస్ సర్కార్ హయాంలో 18 యేండ్లు నిండిన ప్రతి మహిళకు చీరలు పంపిణీ చేస్తు కాంగ్రెస్ సర్కారు మహిళ సంఘాల సభ్యులకు మాత్రమే పంపిణీ చేస్తూ మరో సారి మహిళలను మోసం చేయడానికి సర్కారు కుట్రలు చేస్తుందన్నారు.మహిళలకు కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు.

## సత్యసాయిబాబా 100వ జయంతి

**కొమురవెల్లి, నవంబరు 23, ప్రభాతవార్త :**
మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం కొండపాక శ్రీ సత్యసాయి సంజీవిని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్‌కేర్‌అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయిబాబా100వ జయంతి సందర్భంగాఅన్నదానంచేశారు.ఆలయఅధికారులు పాల్గొన్నారు.

**డిసిసి అధ్యక్షురాలికి**

## సత్కారం చేసిన మండల నాయకులు



**కొమురవెల్లి, నవంబరు 23, ప్రభాతవార్త :**
జనగామ డిసిసి అధ్యక్షురాలిగా ఎన్నికైన లకావత్ ధన్వంతరిని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, మల్లికార్జున స్వామి దేవాలయ ధర్మకర్త లింగంపల్లి శ్రీనివాస్, పిఎసిఎస్ డైరెక్టర్ బత్తిని నరసింహులుగౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్, కిసాన్ సెల్ అధ్యక్షులు బొచ్చు ఎల్లయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏర్పుల రాజు, మండల కార్యదర్శి స్వాములపల్లి రమేష్, మండల సోషల్ మీడియా కన్వీనర్ చింతల రమేష్ పాల్గొన్నారు.

## సిఎస్ఐ చర్చిలో ప్రత్యేక ఆరాధనలు

**చౌటకూరు,నవంబరు23,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులోని సిఎస్ఐ చర్చిలో ఆదివారం కోతకాలపు కృతజ్ఞతార్పణల పండగ ప్రత్యేక ఆరాధనలు పాస్టర్ రెవ యం రవికుమార్ సుధర్మ ప్రిస్బిటర్ ఇంచార్జీ గురువుల ఆధ్వర్యంలో స్థానిక కమిటి సభ్యులు ఘనంగా నిర్వహించారు. రెవ ఎఆర్ సాలోమోన్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరై కోతకాలపు పండగ దేవుని సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో పాస్టరేట్ ఆఫీస్ బేరార్స్ కె గాబ్రియేల్, బి మాణిక్యం, డి ప్రేమ్ కుమార్, సంఘ పెద్దలు బి దేవయ్య, గౌని ప్రేమ్ సాగర్, కమిటి సభ్యులుబి పురుషోత్తం, జి కరునాకర్, బి ప్రభుకిరణ్, డి సామ్‌సన్, లోకల్ యూత్ సెక్రటరీ బి చక్రపాణి, సభ్యులు ప్రసనన, సుకుమార్, మధు, కిరణ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతం ఖాయం

**కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్**

**గజ్వేల్,నవంబరు23 ప్రభాతవార్త:**
సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం ఖాయమని కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని తూంకుంట ఆంక్షరెడ్డికి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం మహిళలకు జిల్లా అధ్యక్ష పదవి కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళల పట్ల ఉన్న గౌరవం ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో అవినీతి రాజ్యమేలిందని, కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రజలు రేవంత్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పార్టీ బలోపేతం కోసం పార్టీ వెన్నంటే ఉంటూ పార్టీ కార్యకలాపాల్లోచురుకుగా పాల్గొన్నా రన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా తూంకుంట నర్సారెడ్డి ఉన్నప్పుడు అభివృద్ధియే ధ్యేయంగా పనిచేశారని గుర్తుచేశారు. తూంకుంటనర్సారెడ్డి వారసురాలైన తూంకుంట ఆంక్షరెడ్డికి కాంగ్రెస్‌పార్టీలో సముచిత స్థానం దక్కిందన్నారు. రాష్ట్ర యువజన విభాగంలో కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడినట్లు అధిష్ఠానం గుర్తించడంతో అధ్యక్ష పదవి ఇవ్వడం జరిగిందన్నారు. తూంకుంట నర్సారెడ్డి ఆశీస్సులతోఆంక్షరెడ్డికిజిల్లా అధ్యక్షపదవి లభించడం అభినందనీయ మన్నారు. ఆంక్షరెడ్డికి జిల్లా అధ్యక్షురాలిగా నియమించడంతో కార్యకర్తల్లో నూతనుత్తేజం పొందారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సారధ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి సహకారంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అంతా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపిశెట్టి అశోక్‌కుమార్‌గుప్త, ఎస్సీ సెల్ పట్టణ నాయకులు మన్నె అరుణ్‌కుమార్, పూదరి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నక్క రాములుగౌడ్

## మృతురాలికి ఆర్థిక సాయం

**చేర్యాల,నవంబర్ 23,ప్రభాతవార్త:**చేర్యాల పట్టణంలోని తూర్పు గుంటూరు పల్లికి చెందిన ఎలా శ్రీదేవి మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పళ్లా రాజేశ్వర్ రెడ్డి వారి కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించి పార్టీ నాయకులతో ఆర్థిక సహాయం ఐదు వేలు అందించారు.చేర్యాల పట్టణ మాజీ ఉపసర్పంచ్ మంచాల కొండయ్య.మాజీ కౌన్సిలర్ మంగోల్ చంటి,నాలుగు మండలాల యూత్ అధ్యక్షులు శివగారి అంజయ్య. బిఆర్ఎస్వి చేర్యాల పట్టణ అధ్యక్షుడు ఒగ్గు శ్రీశైలం,పార్టీ మూడో వార్డు అధ్యక్షులు భూమిగారి రాజేందర్,బాచి తదితరులు ఉన్నారు.

## కూతురు మృతితో తల్లి ఆత్మహత్య



**ఝరాసంగం, నవంబరు 23, ప్రభాతవార్త:** కన్న కూతురు నియోనియా వ్యాధితో చికిత్స పొందుతూ మృతి చెందడంతో మానసికంగా అవస్థలుపడి జీవితంపై విరక్తిచెంది తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కథనం ప్రకారం ఇందు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎల్గోయి గ్రామానికి చెందిన బోయిన వెంకట్, లావణ్య దంపతుల కుమార్తె ఐను (3) నిమోనియా వ్యాధితో అవస్థలు పడుతుండగా చికిత్సకోసం హైద్రాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స అందుకుంటూ ఐను ఈ నెల22న కానరాలిలోకానికి చేరుకోగా సాయంత్రం స్వగ్రామమైన ఎల్గోయిలో కన్నీటి వీడ్కోలు పలికారు. కన్న కూతరుకు మూడేళ్లకు నూరేళ్ల నిండటంతో మానసికంగా క్షోభించి తల్లి లావణ్య జీవితంపై విరక్తి పెంచుకుని ఇంట్లో ఉరిపెట్టుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి జహీరాబాద్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్ వివరించారు.

## శతజయంతి ఉత్సవాల్లో కార్పొరేటర్ సింధు



**రామచంద్రాపురం,నవంబరు23,ప్రభాతవార్త:**భగవాన్‌శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భారతీ నగర్ డివిజన్ కార్పోరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయా సేవ సమితి భెల్ టౌన్‌షిప్ కన్వీనర్ రామ్‌గోపాల్,సత్యవతి,ప్రవీణ్ పాల్గొన్నారు. ఎల్ఐజి కాలనీలో శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప మహాపడిపూజలో కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొని పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

## పేదింటి ఆడబిడ్డకు పుస్తెమట్టెలు



**గజ్వేల్‌టౌన్,నవంబరు23ప్రభాతవార్త: దౌల్తాబాద్‌మండలంసూరంపల్లి గ్రామానికి చెందిన** వర్గంటి అనితనాగేష్ లకూతురు అక్షయవివాహానికిహైద్రాబాద్‌కు చెందినని మ్మశంకంఆదివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీమున్నూరు కాపు అధ్యక్షుడు చందానర్సింలుద్వారా పుస్తె మట్టెలను అందజేశారు .గంగిశెట్టి నర్సింలు, నాయిని సందీప్, బారు అరవింద్‌అల్వాల యాదగిరి, పిడిచెడ్ శ్రీనివాస్,చిందం రాజయ్య, వర్గంటికిరణ్ పాల్గొన్నారు.

## నిరుపేద వధువుకు ఆర్థిక సహాయం



**గజ్వేల్, నవంబరు 23 ప్రభాతవార్త:**గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డుకు చెందిన నిరుపేద కుటుంబమైన గుజ్జ లావణ్య కుమార్తె వివాహం సందర్భంగా వివిఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఊడెంసారిక శ్రీనివాస్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డివివాహానికిహాజరైనూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకులు చిట్కులశివారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్షేత్ర అభివృద్ధికి తనవంతు సహకారం

**-గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**



నర్సారెడ్డిని సన్మానిస్తున్న ఎర్రం శ్రీనివాస్ గురుస్వామి

**గజ్వేల్, నవంబరు 23 (ప్రభాతవార్త):**
గజ్వేల్ పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప క్షేత్ర అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం ఉంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హరిహరపుత్ర అయ్యప్ప క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ గురుస్వామి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ డైరెక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డి, సిసిఐ మానిటరింగ్ సభ్యుడు శివారెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల శాఖ అధ్యక్షుడు శేఖర్‌గుప్త, గురుస్వాములు దుర్గయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తూంకుంట ఆంక్షరెడ్డిని సన్మానిస్తున్న ఈదుగాని శివులు

**గజ్వేల్, నవంబరు 23 (ప్రభాతవార్త):**
సిద్దిపేటజిల్లాలో యువ నాయకురాలు తూంకుంట ఆంక్షరెడ్డికి అధ్యక్ష పదవి ఇవ్వడం పట్లహర్షం వ్యక్తం చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు ఈదుగాని శివులు పేర్కొన్నారు. ఆదివారంగజ్వేల్ పట్టణంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని మహిళకు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళల పట్ల ఉన్న గౌరవమే నిదర్శనమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు రెట్టింపు ఉత్సాహంతో ముందుకు వెళ్తారన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో సైతం కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు.

# ద్విచక్ర వాహనాలు ఢీ- ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆసుపత్రికి తరలిసఉన్తున్న సిఐ అనిల్‌కుమార్

చౌటకూరు, నవంబరు 23, ప్రభాతవార్త: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయాలకు గురైన సంఘటన మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని చక్రియాల్ గ్రామానికి చెందిన మిన్పూర్ పందరి తనకు చెందిన ద్విచక్ర వాహనంపై సుల్తాన్‌పూర్ వైపు నుంచి మిన్పూర్‌కు వెళుతున్న క్రమంలో హైద్రాబాద్‌లోని గచ్చిబౌలి, నానక్‌రాం గూడ ప్రాంతాలకు చెందిన సాయిసద్గురు, వెంకటప్రసాద్‌లు టేక్మాలు మండలం బొడ్మట్‌పల్లి గ్రామంలో బంధువు ఇంట్లో జరిగిన శుభకార్యంలో పాల్గొని ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతున్న క్రమంలో రెండు వాహనాలు ఢీకొన్నాయి. క్షతగాత్రులను అటుగా వెళుతున్న జోగిపేట సిఐ అనిల్‌కుమార్ గమనించి ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్‌లో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం




ముగింపు సమావేశం దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 23, ప్రభాతవార్త:** ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ మండలం గాంధీ నగర్ గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఏడు రోజుల పాటు సాగిన ఈ శిబిరంలో వాలంటీర్లు గ్రామ ప్రజలతో కలిసి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ గంగాధర్ ముఖ్య అతిథిగా, ప్రత్యేక అతిథిగా స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సంతోషిణి పాల్గొని వాలంటీర్ల సేవా కార్యక్రమాలనుఅభినందించారు.అనంతరంఏర్పాటుచేసినసమావేశంలో మాట్లాడుతూ వాలంటీర్లుగ్రామపరిసరాలు,స్కూల్ ప్రాంగణం,రహదారుల్లో స్వచ్ఛత కార్యక్రమాలు, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, శుభ్రత అవగాహన,క్లీన్ అండ్ గ్రీన్ ఇంటింటి సర్వే,ర్యాలీ ద్వారా ప్రజా చైతన్యంలాంటివి చేశారని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేసిన కార్యక్రమాలుగ్రామానికిఆదర్శంగానిలిచాయన్నారు. ఈ కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహించిన ప్రోగ్రాంఆఫీసర్ తిరునహరి రణధీర్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ముగింపు కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్ఎస్ రాజు, బివాల్య, వి సదాశివ్, ఎల్లయ్య, సిహెచ్ విద్యాసాగర్, ఎస్ సత్యనారాయణ, బి చందు, సిహెచ్ రాజ్ రెడ్డి, ఎస్ అశోక్, వెంకటేష్, మమత, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## రెగ్యులర్ కార్యదర్శిని నియమించండి



పందిల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్లెక్సీ దృశ్యం

**హుస్నాబాద్‌రూరల్, నవంబరు 23**, ప్రభాతవార్తమండలంలోని పందిల్ల గ్రామానికి డిప్యూటేషన్‌పై వచ్చిన కార్యదర్శి రాజేందర్‌ను గ్రామం నుండి తొలగించి తమకు రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు పందిల్ల బస్టాండ్ ఆవరణలో ఆదివారం సాయంత్రం పెక్సీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటేషన్ పై గ్రామానికి వచ్చిన కార్యదర్శి రాజేందర్, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో పాటు ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని, ఇక్కడ గతంలో పని చేసిన శ్రీనివాస్ ఇక్కడి నుండి బదిలీ కావడంతో సతీష్ అనే కార్యదర్శికి పోస్టింగ్ ఇచ్చారని అయితే ఆయన డిప్యూటేషన్‌పై గాంధీనగర్‌కు వెల్లల్లగా ఆయన స్థానంలో ముత్తన్నపేట గ్రామ కార్యదర్శిగా పని చేస్తున్న రాజేందర్ డిప్యూటేషన్‌పై తమ గ్రామానికి వచ్చారని, వచ్చిన ఆయన గ్రామ ప్రజలకు కనీసం అందుబాటులో ఉండక పోగా, గ్రామంలోని సమస్యలనుగురించి వివరిస్తే పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఆయనను గ్రామం నుండి తొలగించి తమ గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని వారు ముక్త కంటంతో డిమాండ్ చేశారు. ఈ విషయంలో మండల ప్రజా పరిషత్ అధికారికి రెండు రోజుల క్రితమే వినతి పత్రం సమర్పించామని ఆయన స్పందించని కారణంగానే నేడు రోడ్డుపై ప్లెక్సీని ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ప్లెక్సీని ఏర్పాటు చేసిన వారిలో గ్రామానికి చెందిన దాదాపు ముప్పై మంది యువకులు ఉన్నారు.

## కార్యదర్శిగా రాజేందర్‌ను కొనసాగించండి

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 23, ప్రభాతవార్త**
హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై వచ్చిన రాజేందర్‌నే కొనసాగించాలని గ్రామస్థులు శనివారం రోజున మండల ప్రజా పరిషత్ అధికారి రమేష్‌కు వినతి పత్రం అందజేసినట్లు ఆదివారం రోజున విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు విడుదల చేసిన ప్రకటనలో తమ గ్రామానికి డిప్యూటేషన్‌పై వచ్చిన కార్యదర్శి రాజేందర్‌పై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు కావాలనే ఉద్దేశపూర్వకంగా ఇటీవల ఎంపిడివోకు తప్పుడు ఫిర్యాదు చేశారని, రాజేందర్ తమ గ్రామంలో ప్రజలకు అందుబాటులోనే ఉంటూ అన్ని పనులు సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. కావున పందిల్ల కార్యదర్శిని బదిలీ చేయకుండా ఎదావిధిగా కొనసాగించాలని కోరారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**జహీరాబాద్, నవంబరు 23, ప్రభాతవార్త:** పట్టణంలోని మాణిక్‌ప్రభు పాఠశాలలో ఆదివారం 2006-07 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఆదివారంను ఆనందంగా గడిపారు. నాడు తమకు విద్యాబుద్ధి నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం వెంకటయ్య, గురువుల మధుమతి, సుధా, అరుణ, కులకర్ణి, రఘు, ధర్మారెడ్డి, నర్సింలు, ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం పట్టణ కమిటి ఎన్నిక

**చేర్యాల,నవంబర్ 23,ప్రభాతవార్త**చేర్యాల పద్మశాలి సంఘం పట్టణ కమిటీని ఆదివారం స్థానిక మార్కండేయ స్వామి ఆలయంలో అధ్యక్ష,కార్యదర్శులను జిల్లా కమిటిఆధ్వర్యంలోఎన్నుకున్నారు. అధ్యక్ష,కార్యదర్శులుగా కొక్కుల సురేందర్,పాము బాలనర్సు,కోశాధికారిగా మలిపెద్ది వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ సంధర్భంగా నూతన కమిటీని సంఘ పెద్దలు వీరబత్తిని సత్యనారాయణ,ఆడెపు వెంకయ్య, గోనె హరి,కూరపాటి మధు కుల సంఘము సభ్యులు తదితరులు అభినదించారు.

## అనుమానంతో వ్యక్తిపై దాడి

**పుల్‌కల్,నవంబరు23, ప్రభాతవార్త:** తమ పెంపుడు కుక్క మృతికి కారణం నర్సింలు కుటుంబమే అంటూ బంటు మల్లయ్య కుటుంబ సభ్యులు నర్సింలుపై దాడి చేసిన సంఘటన ఉమ్మడి పుల్‌కల్ మండలంలో కలకలం రేపింది. ఎస్ఐ కథనం ప్రకారం... చౌటకూరు మండలం వెండికోల్ గ్రామంలో శనివారం సాయంత్రం నర్సింలు, మల్లయ్య కుటుంబ సభ్యుల మద్య గొడవలు చోటుచేసుకోగా మల్లయ్య, మల్లమ్మ, మహేష్, కృష్ణ, రేణుకలు కలిసి నర్సింలుపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చారు. క్షతగాత్రుడు నర్సింలును 108 వాహనంలో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న నర్సింలు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రుడు నర్సింలు కుమారుడు సన్ని ఫిర్యాదు మేరకు పుల్‌కల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.